అపార్‌కు ఆధార్ అడ్డంకులు!

- సర్వర్ ఇబ్బందులతో పనిచేయని ఆధార్ కేంద్రాలు
- అవస్థలు పడుతున్న విద్యార్థులు

టెక్కలి: విద్యార్థులకు వన్ నేషన్–వన్ ఐడీ కార్డు పేరుతో ప్రభుత్వం అపార్ (ఆటోమేటిక్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రి) కార్డుకు శ్రీకారం చుట్టింది. విద్యార్థులకు సంబంధించి పాఠశాలలో ఉన్న వివరాలు కాకుండా ఆధార్ కార్డులో ఉన్న వివరాలు కీలకమని చెప్పింది. దీంతో ఆధార్‌లో చేర్పులు.. మార్పుల కోసం విద్యార్థులు ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. విద్యార్థులందరికీ కార్డులు ఉన్నప్పటికీ అందులో పుట్టిన సంవత్సరం మాత్రమే ఉండడం తేదీలు లేకపోవడంతో అపార్ నమోదు ప్రక్రియలో వారి వివరాలు నమోదు కావడం లేదు. దీంతో చేర్పులు, మార్పుల కోసం ఆధార్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. మరో వైపు సర్వర్ సమస్యతో ఆధార్ నమోదు ప్రక్రియ జరగడం లేదు. గత ప్రభుత్వం వరకు గ్రామ సచివాలయాల్లో సక్రమంగా పనిచేసిన ఆధార్ కేంద్రాలు ఇప్పుడు సర్వర్ సమస్యలతో నత్తనడకన సాగుతోంది. ఒక వైపు తాత్కాలిక ఆధార్ కేంద్రాలు పనిచేయకపోవడం.. మరో వైపు గ్రామ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాల్లో నమోదు సక్రమంగా జరగకపోవడంతో అపార్ ప్రక్రియకు కష్టాలు ఎదురవుతున్నాయి. డివిజన్ కేంద్రమైన టెక్కలిలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలోని ఆధార్ నమోదు కేంద్రం గత పది రోజులుగా పనిచేయడం లేదు. అలాగే హెడ్ పోస్టల్ కార్యాలయంలోని కేంద్రం సర్వర్ సమస్యలతో సక్రమంగా కొనసాగడం లేదు. ఒక్క బ్యాంక్ ఆఫ్ బరోడాలో మాత్రమే ఆధార్ నమోదు జరుగుతున్నప్పటికీ నమోదుకు రోజుల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి చోటు చేసుకుంది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి ఆధార్ నమోదు కేంద్రంలో నమోదు ప్రక్రియ సక్రమంగా జరిగే విధంగా చూడాలని విద్యార్థులు కోరుతున్నారు.



టెక్కలిలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో పనిచేయని ఆధార్ నమోదు కేంద్రం


పోస్టల్ కార్యాలయంలో సర్వర్ సమస్యతో పనిచేయని ఆధార్ నమోదు కేంద్రం

ఇబ్బందులు పడుతున్నాం..



నా ఆధార్‌లో పుట్టిన సంవత్సరం మాత్రమే ఉంది. పుట్టిన తేదీ చేర్చడానికి ఆధార్ కేంద్రానికి వస్తే పనిచేయడం లేదని చెబుతున్నారు. అపార్ నమోదు కోసం ఆధార్ కార్డులో వివరాలు పక్కాగా ఉండాలని కళాశాల యాజమాన్యం చెబుతున్నారు. ఆధార్ కేంద్రాలు సక్రమంగా పనిచేస్తే మాకు ఇబ్బందులు ఉండవు. ప్రస్తుతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

–కె.విజిత్‌కుమార్, విద్యార్థి, టెక్కలి

పూండి నుంచి వచ్చాను..



నా కుమారుడు అపార్ నమోదు కోసం ఆధార్‌లో అప్‌డేట్ చేయడానికి పూండి నుంచి టెక్కలి హెడ్ పోస్టాఫీసుకు వచ్చాను. ఇక్కడ సర్వర్ పనిచేయడం లేదని చెబుతున్నారు. ఇటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలి.

–కృష్ణారావు, విద్యార్థి తండ్రి, పూండి, వజ్రపుకొత్తూరు మండలం

లక్ష్యసాధనలో అశ్రద్ధ వద్దు

కవిటి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాల, కళాశాల విద్యకు సంబంధించి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఏపీఏఆర్ (అపార్)కార్డుల డేటా ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసే ప్రక్రియ శతశాతం లక్ష్యసాధనలో ప్రధానోపాధ్యాయులు అశ్రద్ధకు ఏమాత్రం తావివ్వొదని తహసీల్దార్ బి.మురళీమోహన్‌రావు, ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి, ఎంఈవో ధనంజయమజ్జి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 116 ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, ప్రత్యేక అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. లెవెల్ 12లో భాగంగా మండలంలోని 116 విద్యాసంస్థల్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న 11,476 మంది బాలబాలికలకు సంబంధించిన డేటాను అపార్ కార్డుల వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కాగా ఇప్పటి వరకు 7,678 మంది సమాచారం మాత్రమే అప్‌లోడ్ చేసినట్టు పేర్కొన్నారు. మిగిలిన 3,792 మందికి సంబంధించి డేటాను సత్వరమే పూర్తిచేసేలా చొరవ తీసుకోవాలన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ మురళీమోహనరావు

సేవాగుణంతో పని చేయండి

వజ్రపుకొత్తూరు: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయడంలో వలంటీర్ ఉపాధ్యాయులు సేవాగుణంతో పని చేయాలని ఎంపీడీవో ఎస్.రమేష్ నాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంపై వెలుగు సీఏఫ్‌లకు మండలస్థాయి శిక్షణ తరగతులను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓపిక, సహనంతో పాటు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్, లీగల్ లిటరసీల గురించి అవగాహన కల్పించారు. మండలంలోని 1931 మంది నిరక్షరాస్యులకు రోజూ పది మందికి ఒకరు చొప్పున సాయంత్రం ఐదు నుంచి ఏడు గంటల వరకు ఎటువంటి లాభాపేక్ష లేకుడా స్వచ్ఛందంగా అక్షరాస్యతపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ డిక్కల తిరుమలరావు, ఏపీఎం గొడబ ప్రసాదరావు, సీసీలు వీఓఏలు పాల్గొన్నారు.


వజ్రపుకొత్తూరు: మాట్లాడుతున్న ఎంపీడీవో రమేష్‌నాయుడు

దేవరాజు మృతికి పలువురు సంతాపం


దేవరాజు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రామారావు, చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి


దేవరాజు మృతదేహానికి నివాళులర్పిస్తున్న పిరియా సాయిరాజ్

ఇచ్ఛాపురం: వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం పట్టణ మాజీ అధ్యక్షుడు, సీనియర్ నాయకులు కాళ్ల దేవరాజు మృతికి పలువురు సంతాపం తెలియజేశారు. దేవరాజు శుక్రవారం మృతి చెందగా.. భౌతికకాయాన్ని ఇంటి వద్ద కుటుంబ సభ్యులు ఉంచారు. ఎమ్మెల్యే బెందాళం అశోక్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పిరియా సాయిరాజ్ తదితరులు శనివారం భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, వార్డు కౌన్సిలర్లు, ఇతర ముఖ్య నాయకులు ఉన్నారు.

దాడులపై సమగ్ర దర్యాప్తు చేపట్టండి

టెక్కలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టెక్కలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులుగా ఉన్న దళితులు, ఇతర వర్గాల వారిపై వరుసగా జరుగుతున్న దాడులపై చట్ట పరంగా సమగ్ర దర్యాప్తు చేయాలని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఎస్పీ, టెక్కలి ఇన్‌చార్జి డీఎస్పీ పి.శ్రీనివాసరావును శనివారం టెక్కలిలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఇటీవల కాలంలో జరిగిన దాడులపై ఆధారాలతో సహా వివరించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ.. ఇటీవల కోటబొమ్మాళి మండలం కిష్టుపురం గ్రామంలో దళిత కుటుంబంపై టీడీపీ కార్యకర్తలు మూకుమ్మడిగా దాడి చేసి తీవ్రంగా గాయపరచిన సంఘటన విషయంలో దాడి చేసిన వారిని చట్టపరంగా శిక్షించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కిష్టుపురం, కొత్తపేట, పాకివలస, తిర్లంగి, వెంకటాపురం, చాకిపల్లి, నౌగాం, సంతబొమ్మాళి, ఎం.నర్సాపురం తదితర గ్రామాల్లో దళితులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ కార్యకర్తలు చేసిన దాడులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా కేసు నమోదు దర్యాప్తు కొనసాగించాలన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా బాధితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సత్తారు సత్యం, బొడ్డు వెంకటరమణ ఉన్నారు.


ఏఎస్పీ శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న తిలక్

సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం

కాశీబుగ్గ: పలాస మండలం రామక్రిష్ణాపురంలోని శ్రీసత్యసాయి విద్యావిహార్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే గౌతు శిరీష శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనేక రుగ్మతలతో నలుగుతున్న ప్రస్తుత సమాజంలో విలువలు చెప్పే పాఠశాలలు ఎంతో అవసరమని అన్నారు. ప్రవాసభారతీయుడు, తానా సభ్యులు గోరెంట్ల వాసుబాబు పర్యవేక్షణలో సైన్స్, సోషల్, మాథ్స్ మోరల్ విద్యకు సంబంధించిన యూనిట్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏపీటీపీఎస్ చైర్మన్ వజ్జ బాబూరావు, రాష్ట్ర కళింగ కోమటి సంఘ అధ్యక్షులు బోయిన గోవిందరాజు, డోకి రామారావు, స్కూల్ కరస్పాండెంట్ మల్లా పరమేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతీ చౌదరి, డోకి రామారావు పాల్గొన్నారు.


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

వైభవంగా కోటి వ్రత దీక్షలు


బెజ్జిపుట్టుగలో పూజలందుకున్న చక్రధరస్వామి

కవిటి: మండలంలోని వివిధ గ్రామాల్లో కోటి సోమవారం వ్రతదీక్షలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వేకువ జాము నుంచే భక్తులు పవిత్ర నదీ, సముద్ర స్నానాలు ఆచరించి కార్తీకదీపాలను విడిచిపెట్టారు. కార్తీక మాసంలో శ్రవణా నక్షత్రం రోజున కోటి సోమవారంగా జరుపుకుంటామని పండితులు పేర్కొన్నారు.

అర్హులందరికీ శ్రీనిధి రుణాలు


సిబ్బందికి సూచనలిస్తున్న ఏపీఎం ప్రసాదరావు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలో శ్రీనిధి రుణాలకు దరఖాస్తున్న చేసుకున్న అర్హత ఉన్న సంఘాలకు రుణాలు మంజూరు చేస్తామని సెర్ప్ ఏపీఎం సనపల ప్రసాదరావు తెలిపారు. శనివారం మండల సమాఖ్య కార్యాలయంలో సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. స్వయం శక్తి సంఘాల వివరాలను పరిశీలించి వారి సంఘ తీర్మాణాలు సక్రమంగా ఉన్నాయో లేదో అన్న విషయాలను పరిశీలించాలని సూచించారు. రుణాలు పొందిన సంఘ సభ్యులకు బీమా సదుపాయం ఉంటుందన్నారు. సమావేశంలో సీసీ డి.మోహనరావు, డి.లక్ష్మీ, వీవోఏలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ


గోవులకు పూజలు చేస్తున్న భక్తులు

ఇచ్ఛాపురం: పట్టణంలోని జగన్నాథస్వామి ఆలయ ఆవరణలోని గోవులకు భక్తులు భక్తిశ్రద్ధలతో శనివారం పూజలు నిర్వహించారు. గోఅష్టమిని పురస్కరించుకొని గోవులను పసుపు, కుంకుమలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు పద్మకుమార్ ఆచారి ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో అధికంగా పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీటీ శ్రీహరి

ఇచ్ఛాపురం: ప్రత్యేక ఓటర్ల నమోదు ప్రక్రియను రెండురోజుల్లో పోలింగ్ కేంద్రాల వద్ద చేపట్టనున్నట్టు ఎలక్షన్ డీటీ శ్రీహరి తెలిపారు. ఈ మేరకు శనివారం పురపాలక సంఘం పరిధిలోని 18, 19, 35, 36, 37, 45, 46, 47, 69, 70, 71, పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేసేందుకు ఫారం 6, 7, 8లను తీసుకుంటామన్నారు.

ప్రారంభానికే పరిమితం..

టెక్కలి మేజర్ పంచాయతీలో రోడ్లపై విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువుల కోసం ఏర్పాటు చేసిన గోసంరక్షణ కేంద్రం ప్రారంభానికే పరిమితమైంది. రోడ్లపై తిరిగే పశువుల వలన కొన్ని సందర్భాల్లో వాహన చోదకులకు ప్రమాదాలు, మరి కొన్ని సందర్భాల్లో పశువులకు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలతో టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి ఆనుకుని గోసంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా రోడ్లపై ఎక్కడా పశువులు సంచరించకూడదంటూ పంచాయతీ అధికారులను ఆదేశించారు. అయితే మంత్రి ఆదేశాలు ఎక్కడా అమలు కావడం లేదు. విచ్చలవిడిగా పశువులు రోడ్లపై సంచరిస్తున్నాయి.

–టెక్కలి


పాత జాతీయ రహదారిపై సంచరిస్తున్న పశువులు


ఆర్భాటంగా ప్రారంభించిన గోసంరక్షణ కేంద్రం

కోతులతో అవస్థలు

మండల కేంద్రం కంచిలిలో కోతులతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. సుమారు రెండేళ్ల క్రితం అడవుల నుంచి కోతులు ఇక్కడకు చేరాయి. అప్పటి నుంచి వీటి సంతతి పెరుగుతూ వస్తుంది. ముఖ్యంగా మఠం కంచిలి పరిసర ప్రాంతంలోని జగన్నాథ స్వామి మఠంలో గల తోటలో స్థావరం ఏర్పాటు చేసుకున్నాయి. అక్కడ నుంచి గ్రామంలో అన్ని చోట్ల తిరుగుతూ స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. బయట ఏ వస్తువు విడిచిపెట్టినా పట్టుకొని పోతున్నాయి. దుకాణాల్లో వేలాడదీసే సామాన్లను అమాంతంగా లాక్కెళ్లిపోతున్నాయి. అడ్డుకునే ప్రయత్నం చేసేవారిపై దాడి చేస్తున్నాయి. అధికారులు స్పందించి కోతుల నుంచి రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

–కంచిలి



సగంలో వదిలేశారు..

పలాస మండలం నీలావతి గ్రామానికి నిర్మిస్తున్న బీడీ రోడ్డు నిర్మాణ పనులను మధ్యలోనే వదిలేశారు. జాతీయ రహదారి నుంచి మధ్యలో ఉన్నటువంటి రైలుగేటు దాటి వెళ్లే ఈ రహదారి బ్రిటీష్ కాలం నుంచి మట్టి రోడ్డుగానే ఉండేది. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రోడ్డు మంజూరై పనులు ప్రారంభమయ్యాయి. అయితే ఆ తరువాత ప్రభుత్వం మారడంతో అప్పటి నుంచి పనులు జరగక అధ్వానంగా తయారైంది. వర్షాలకు మట్టి క్రషర్‌బుగ్గి కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది. పాలకులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని ఉద్దాన వాసులు కోరుతున్నారు.

–కాశీబుగ్గ



ఓం నమో వేంకటేశాయః

కార్తీక మాసం తొలి శనివారం సందర్భంగా ఇచ్ఛాపురం మండలం బొడ్డఖాళీ వేంకటేశ్వర స్వామి ఆలయం ఆంధ్రా, ఒడిశా భక్తులతో కిటకిటలాడింది. ఉదయం స్వామి వారికి మేల్కొలుపు అనంతరం వందలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ పోలీసులు బందోబస్తు నిర్వహించగా, భక్తులకు అసౌకర్యం కలుగకుండా కమిటీ సభ్యులు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం భక్తులు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

–ఇచ్ఛాపురం రూరల్



నాయకుల పరామర్శ


లింగమూర్తిని పరామర్శిస్తున్న తిలక్ తదితరులు


టెక్కలి: మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

కోటబొమ్మాళి: మండలంలోని కొత్తపేట ఎంపీటీసీ మాజీ సభ్యుడు దాట్ల లింగమూర్తి అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ శనివారం లింగమూర్తిని పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. నాయకులు అన్నెపు రామారావు, రోణంకి మల్లయ్య, దుక్క రామక్రిష్ణ, రాంపాత్రుని శివారెడ్డి, కాళ్ల సంజీవరావు, పేడాడ వెంకటరావు ఉన్నారు.

టెక్కలి: టెక్కలి మండలంలో పలువురు కుటుంబాలను ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ శనివారం పరామర్శించారు. స్థానిక భైరివీధిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త చలపాకుల చంటి సోదరుడు ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని, అయోధ్యపురంలో దుంపల ఈశ్వరరావు తండ్రి మృతి చెందడంతో అతని కుటుంబాన్ని, టెక్కలి తహసీల్దార్ కార్యాలయం కంప్యూటర్ ఆపరేటర్ శ్రావణ్‌కుమార్ భార్య ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. నాయకులు యు.విశ్వనాథం, జి.తేజ, నర్సింగ్ నాథ్ సాబతో, డి.మదీన్ ఉన్నారు.

సంక్షిప్తంగా...

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

వజ్రపుకొత్తూరు రూరల్: గ్రామీణ రహదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. కొండపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. నాయకులు సూరాడ మోహన్‌రావు, లైశెట్టి భీమారావు, దాసరి జేజేరావు, బి.శశిభూషన్, కె.సురేఖ, యంపల్ల తులసీరావు, జోగారావు ఉన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ట

కంచిలి: మండపల్లి గ్రామంలోని బుడాలింగేశ్వర ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన మాదిన సత్యం, శ్యామల దంపతులు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హోమం చేశారు. భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

ఐదు కేంద్రాల్లో నిలిచిన ఆధార్ సేవలు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మండలంలోని ఐదు సచివాలయాల్లో గత ప్రభుత్వం ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే ఇప్పుడు ఈ కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో సేవలు నిలిచిపోయాయి. ప్రసుతం విద్యార్థులకు అపార్ ఐడీ కార్డులు మంజూరు చేయాల్సి ఉండగా దీనికి ఆధార్ కార్డుల్లో సవరణల కోసం కేంద్రాల చుట్టూ తిరుగుతూ ఇక్కట్లు పడుతున్నారు. కోటబొమ్మాళి, చీపుర్లపాడు, హరిశ్చంద్రపురం, మహసాహెబ్‌పేట, దంత సచివాలయాల్లోని ఆధార్ కేంద్రాలు పనిచేయడంలేదు. దీంతో విద్యార్థులు దూర ప్రాంతాలైన నరసన్నపేట, టెక్కలి వెళ్తుండగా.. అక్కడ కూడా సేవలు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యల చేపట్టి ఆధార్ సేవలు పునఃరుద్ధరించాలని కోరుతున్నారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఇచ్ఛాపురం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఖుర్దా డివిజన్ పరిధిలో అమృత్‌భారత్ స్టేషన్ స్కీంలో భాగంగా వికసిత్ భారత్–వికసిత్ రైల్వే అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. 42 పాఠశాల విద్యార్థులు పాల్గొనగా స్థానిక జ్ఞానభారతి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. వీరికి డీఆర్ఎం హెచ్ఎస్ బజ్వా ప్రశంసా పత్రంతో నగదు బహుమతిని శనివారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి జోహార్‌ఖాన్ పాల్గొన్నారు.

108 వాహన సిబ్బంది నిరసన

కాశీబుగ్గ: తమ డిమాండ్లను పరిష్కరించాలని 108 వాహన సిబ్బంది కోరారు. ఈ మేరకు పలాసలో నిరసన కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైద్య, ఆరోగ్య శాఖలోని పోస్టుల్లో తమను నియమించాలని, పైలెట్లను ఆర్టీసీలో డ్రైవర్లుగా ఎంపిక చేయాలని, ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని, చనిపోయిన ఉద్యోగులకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాసాల సత్యం, బత్తిని తారకేశ్వరరావు, నెయ్యల వెంకటరావు, అల్లాడ మోహనరావు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కంచిలి: సిమెంటు రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీవో వి.తిరుమలరావు సూచించారు. కొండపోలేరు, ఎక్కల, మకరాంపురం గ్రామాల్లో పల్లెపండగ కార్యక్రమాల ద్వారా మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం నిధులతో మంజూరైన సిమెంటు రోడ్డు పనులను శనివారం పరిశీలించారు. మెటీరియల్ వినియోగం, రోడ్డు నిర్మించే పద్ధతులను పరిశీలించి, నిర్మాణదారునికి సూచనలిచ్చారు. ఉపాధిహామీ పథకం ఏపీవో జి.ధనుంజయ రావు, ఆయా పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

సైనిక సేవా సమితి అధ్యక్షునిగా రామారావు


అధ్యక్ష, కోశాధికారులను అభినందిస్తున్న సభ్యులు

వజ్రపుకొత్తూరు: పెద్దమురహరిపురం గ్రామంలోని సైనిక సేవా సమితి అధ్యక్షునిగా గౌరకల రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక కాళీమాత ఆలయం వద్ద శనివారం సమావేశం నిర్వహించారు. పూర్వ అధ్యక్షుడు కె.దేవదాసు కార్యవర్గాన్ని ప్రకటించారు. ఉపాధ్యక్షునిగా గౌరకల గన్నెయ్య, కోశాధికారిగా అర్జి రామారావులకు బాధ్యతలు అప్పగించారు. గ్రామంలో సుమారు 150 మంది వరకు మాజీ, సర్వీసులో ఉన్న సైనికులు ఉన్నందున వారి సంక్షేమం కోసం నిత్యం కృషి చేయాలని కోరారు. సేవా సమితి ద్వారా చేపట్టే అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అధ్యక్షుడు రామారావు కోరారు. కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు తాళ్లూరు మురళీ ఉన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం


సాయాన్ని అందజేస్తున్న సంఘ సభ్యులు

సోంపేట: మామిడిపల్లి గ్రామానికి చెందిన తెలుకుల ప్రశాంత్ డాబా పైనుంచి పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వైద్యానికి లక్షలాది రూపాయలు ఖర్చవుతుందని వైద్యులు ప్రకటించారు. ఇతని కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రామే. విషయం తెలుసుకున్న మండలంలోని తాళభద్ర గ్రామానికి చెందిన యువజన సేవా సంఘం సభ్యులు రూ. పది వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని ప్రశాంత్‌కు శనివారం అందజేశారు. కార్యక్రమంలో సంఘప్రతినిధులు యర్ర గణపతి, నెయ్యిల సింహాచలం, దున్న ఈశ్వరరావు, ఉగ్రపల్లి పూర్ణచంద్రరావు ఉన్నారు.

రచయిత తెప్పలకు సత్కారం


కృష్ణమూర్తిని సన్మానిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో శ్రీశ్రీ కళావేదిక 141వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం శనివారం జరిగింది. ఇందులో పలాసకు చెందిన సీనియర్ రచయిత, నటుడు, జనజాగృతి, వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి పాల్గొని వృద్ధాప్యమూ వరమే కవితాగానం చేసి ప్రశంసలు పొందారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య శ్రీనివాసరావు, శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, డాక్టర్ పార్థసారధి తదితరులు కృష్ణమూర్తిని దుశ్శాలువ, జ్ఞాపికా ప్రశంసా పత్రం, పుష్ప మాలతో ఘనంగా సత్కారించి అభినందించారు.

కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు

కాశీబుగ్గ: తన కుమార్తె కనిపించడం లేదని కాశీబుగ్గ రోటరీనగర్‌లో నివాసం ఉంటున్న వజ్రపుకొత్తూరు మండలం అమలపాడు గ్రామానికి చెందిన దున్న సరస్వతి ఫిర్యాదు చేసినట్టు కాశీబుగ్గ పోలీసులు శనివారం తెలిపారు. ఈనెల ఐదో తేదీ రాత్రి ఇంట్లో పడుకుందని.. ఉదయం లేచి చూసేసరికి లేదని ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. కాశీబుగ్గ సీఐ మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాపారి మృతి

కాశీబుగ్గ: మందస మండలం చీపి గ్రామం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మందసకు చెందిన రైస్‌మిల్లు వ్యాపారి వడ్డి సంతోష్ కుమార్ (43) బంజీరు నుంచి మందసకు బైక్‌పై వెళ్తుండగా చీపి గ్రామం వద్ద ఆటో ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మందస ఎస్ఐ ఖాదర్ బాషా కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.